ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

కొత్తపల్లి, ఫిబ్రవరి 15: గిరిజన గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాల కోసం నిర్వహించే సీవోఈసెట్-2024 రాసే విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని వరంగల్- కరీంనగర్ ఆర్సీవో వెంకన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 15: సేఫర్ అంతర్జాల దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు గురువారం సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. పోలీస్ శాఖకు చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ కృతజ్ఞతలు తెలిపారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలోని సవరన్ పాఠశాలను డీఈవో జనార్దన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యం పరిశీలించారు. ఇక్కడ హెచ్ఎం సతీశ్ ఉన్నారు.

రికార్డుల పరిశీలన

చిగురుమామిడి, ఫిబ్రవరి 15: బొమ్మనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఫార్మేటివ్ అసెస్మెంట్ నాలుగు పరీక్షల మార్కుల రికార్డులను ప్రత్యేక ఉపాధ్యాయుల బృందం గురువారం పరిశీలించింది. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు పరిశీలించిన బృందం ప్రతినిధులు లింగారెడ్డి, సలీం సంతృప్తి వ్యక్తం చేశారు. వీరి వెంట ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆనవాయితిని పాటించాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి15: సమ్మక్క, సారలమ్మ జాతరలో ఎదుర్కోళ్లను ఎగురవేసే వృత్తి రజకులదేనని తెలంగాణ రజక సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసల సంపత్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో రజకులను ఆడబిడ్డతో సమానంగా భావించే సంప్రదాయం ఉందన్నారు. అనాదిగా వస్తున్న ఆచారానికి కొన్ని జాతర కమిటీలు తిలోదకాలిచ్చి, ఎదుర్కోళ్లకు టెండర్లు వెస్తున్నారని మండిపడ్డారు. ప్రతి జాతరల్లో ఎదుర్కోళ్లను ఎగురవేసే పనిని రజకులకే అప్పగించాలని డిమాండ్ చేశారు.

ఫకీర్ పేట చెరువు వద్ద నీటిని పరిశీలిస్తున్న డీఈ, చెర్లభూత్కూర్ గ్రామ రైతులు

మా పంటలకు నీరు అందించండి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 15: శ్రీరాం సాగర్ డీ-86 కాలువ కింద సాగు చేస్తున్న పంటలకు సరిపడే సాగు నీరు అందించాలని పలు గ్రామాల రైతులు అందోళన వ్యక్తం చేశారు. గురువారం కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్, తాహెర్, కొండాపూర్ గ్రామ రైతులు జూబ్లీనగర్‌లోని ఎస్సారెస్పీ కెనాల్ డీ-86 కాలువ వద్ద ఆందోళన చేపట్టారు. ఫకీర్‌పేటలోని చెరువులోకి నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీనగర్ కెనాల్ నుంచి ఫకీర్‌పేటలోని చెరువులోకి కెనాల్ ద్వారా నీరు చేరకుండా షటర్లు వేశారని డీఈ సంతోష్, ఏఈ నళినికాంత్‌కు వివరించారు. దీంతో డీఈ, ఏఈ, రైతులు ఫకీర్‌పేట గ్రామ చెరువును పరిశీలించారు. 3ఎల్ఆర్ కాలువకు శనివారం వరకు 50 క్యూసెక్‌ల నీరు కాలువ ద్వారా సరఫరా చేయాలని డీఈ లష్కర్లను ఆదేశించారు. చెరువుల కోసం నీటి సరఫరా చేయడం లేదని, కుంటలు, చెరువులు నింపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలువ నీటిని బావులు, చెరువులు, కుంటల్లో నింపకుండా చర్యలు తీసువాలని డీఈ సంతోష్, ఏఈ నళినికాంత్ లష్కర్లను ఆదేశించారు.

నగునూర్‌లో సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లు

జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు, తదితరులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 15: నగునూర్‌లోని ఎలమ్మ ఆలయం వద్ద వాగు ఒడ్డున ఈనెల 21 నుంచి సమ్మక్క, సారలమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తున్నట్లు జాతర నిర్వహణ కమిటీ చైర్మన్ బత్తిని దిలీప్‌గౌడ్ పేర్కొన్నారు. జాతర కరపత్రాలను నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. జాతరకు వచ్చే వారికి నీటి సదుపాయం, సవార్ల, తాగునీటి పంపులు, జాతర వరకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. 21న సారలమ్మ దేవత గద్దెకు వస్తుందని, 22న సమ్మక్క గద్దెకు వస్తుందని, 23న సమ్మక్క, సారలమ్మకు మొక్కులు చెల్లించుకుంటారని, 24న అమ్మవార్ల వన ప్రవేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వెంకన్న, రాజేశం, కొటేశ్వర్లు, ఆంజనేయులు, రాజేశ్ కన్న, అంజయ్య, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి కౌశిక్‌రెడ్డి శుభాకాంక్షలు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 15: బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్ర గురువారం నామినేషన్ వేయగా, ఆయనకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో ఎంపీగా తెలంగాణ వాణిని రాజ్యసభలో వినిపించాలని ఆకాంక్షించారు.

రవిచంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళ మేళా

- శ్రీ ఉషోదయ చేనేత, హస్తకళ మేళకు అపూర్వస్పందన
- ఈనెల 18 వరకు కొనసాగనున్న మేళ

విద్యానగర్, ఫిబ్రవరి 15: 'హస్తకళలను ఆదరిద్దాం.. చేనేతను ప్రోత్సహిద్దాం' అనే నినాదంతో నగరంలోని శ్రీ రాజరాజేశ్వర కల్యాణ మండపం కోర్టు చౌరస్తాలో శ్రీ ఉషోదయ చేనేత హస్తకళ మేళాలో అఖిలభారత హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ఏర్పాటు చేసింది. కళాభారతి హ్యాండ్లూమ్స్ హ్యాండ్ క్రాఫ్ట్ ఆర్టిసన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్, కళాభారతి హ్యాండ్లూమ్స్ హ్యాండీక్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ మినిస్టరీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెల 20న మేళాను ప్రారంభించారు. కాగా, ఈ మేళా ఈనెల 18 వరకు కొనసాగనున్నది. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. చేనేత కార్మికులు నేసిన ఉత్పత్తులను నేరుగా, హస్తకళలను కళాకారులే అమ్మకాలు చేయడంతో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నది. ముఖ్యంగా సెలవు దినాల్లో మేళా కిక్కిరిసిపోతున్నది.

మేళాకు హాజరైన మహిళలు

అందుబాటులో చేనేత, హస్తకళ ఉత్పత్తులు

మేళాలో చేనేత వస్త్రాలు, హస్తకళ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా పోచంపల్లి చీరలు, బెడ్‌షీట్స్, డ్రెస్ మెటీరియల్స్, చీరలు, కలంకారి మంగళగిరి చేనేత వస్త్రాలు, వరంగల్ టవల్స్, లుంగీలు, పొందూరి చేబ్రోలు ఖాదీ వస్త్రాలు, హైదరాబాద్ ఎంబ్రాయిడరీ, చీరలు, జైపూర్ బెడ్‌షీట్స్, టాప్స్, స్కర్ట్స్, తమిళనాడు చెట్టినాడు చీరలు, హైదరాబాద్ బంజారా ఉత్పత్తులు, గుజరాత్ టాప్స్, స్కర్ట్స్, నారాయణపేట, గద్వాల ఉప్పాడ చీరలు, హర్యానా సోఫా కట్‌వర్క్స్, దివాన్ సెట్స్, చిన్నారుల డ్రెస్సులు, నైటీలు, హస్తకళలైన కొండపల్లి బొమ్మలు, ఏటి కొప్పాక బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, ఖాదీ గ్రామోద్యోగ, ఆయుర్వేద ఔషధాలు, బ్యాగులు, కాటన్ బ్యాగులు, ఇమిటేషన్ జ్యువెలరీ, అలంకరణ పుష్పాలు, గృహోపకరణాలు, మైసూర్ రోజ్ ఉడ్, పానల్స్, అగర్‌బత్తీ లు, పుస్తక ప్రియులకు పుస్తకాలు, షహర్ పూ ర్ ఉడెన్ లాకర్‌వేర్, కళాత్మక ఆభరణాలు, బ్యాంగిల్స్, నగిషీలు, రాజస్థానీ మౌత్ ఫ్రెషనర్స్ సరసమైన ధరల్లో అందుబాటులో పెట్టారు.

ప్రజల నుంచి అపూర్వ స్పందన

శ్రీ ఉషోదయ చేనేత, హస్తకళ మేళకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. కళాకారులే నేరుగా అమ్మకాలు కొనసాగించడంతో ప్రజలు సంతోషంగా కొనుగోలు చేస్తున్నారు. కార్పొరేట్ దుకాణాల్లో హస్తకళల పేరిట మోసాలు జరుగుతుండడంతో ఎక్కువ మంది మేళాలోని కొనుగోలు చేస్తున్నారు. మేళాల్లో కొనుగోలు చేసే హస్తకళలను ప్రోత్సహించాలి.

- కిశోర్, మేళా నిర్వాహకుడు

ఇంట్లో వస్తువులన్నీ మేళాలో కొన్నవే

మా ఇంట్లో వస్తువులన్నీ మేళాలో కొన్నవే. అన్నీ బాగున్నాయి. హస్తకళలు అంటే నాకు చాలా ఇష్టం. కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు మేళాలో కొంటె చాలా తక్కువ ఉంటాయి. వీటిని దుకాణాల్లో కొంటే రెండింతలు, మూడింతల ధరలు ఉంటాయి. ప్రతిఒక్కరూ ఈ హస్తకళ మేళాలోనే కొనుగోలు చేస్తే కళాకారులను ప్రోత్సహించినట్లుగా ఉంటుంది.

-లావణ్య, కరీంనగర్

చీరలు చాలా బాగున్నాయి

చేనేత వస్త్రాలైన చీరలు చాలా బాగున్నాయి. పోచంపల్లి, మంగళగిరి చీరలు తక్కువ ధరలోనే అందుబాటులో పెట్టారు. చాలా రకాలు కంటికి దినుసుగా ఉన్నాయి. ఎక్కువగా కాటన్ చీరలను కొనుగోలు చేశాను. రూ. 1000కే మూడు చీరలు రావడం ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ మేళాలోనే కొనుగోలు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలి.

-జ్యోతి, కరీంనగర్

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి

కార్పొరేషన్, ఫిబ్రవరి 15: కరీంనగర్‌లోని అన్ని డివిజన్లు, ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, శివారు డివిజన్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. గురువారం 53వ డివిజన్‌లో రూ.29లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. కాశ్మీర్‌గడ్డ రైతుబజార్‌లో రూ. 10 కోట్లతో సమీకృత మార్కెట్‌ను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీదేవీచంద్రమౌళి, నగరపాలక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలి

రేపటి భవిష్యత్తు నేటి బాలలదేనని, వారి పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పిలుపునిచ్చారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నగర బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలబాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలతో పాటు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. 1098 హెల్ప్‌లైన్ బాలలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో, శిశు మహిళా సంక్షేమ, కార్మిక, పోలీస్, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

కార్పొరేషన్/కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 15: కరీంనగర్‌లో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు గురువారం నగరంలోని రేకుర్తి, మల్కాపూర్‌లో ఘనంగా జరిగాయి. బంజారా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొని సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ కార్పొరేటర్ రాజశేఖర్ పాల్గొన్నారు. శాతవాహన యూనివర్సిటీలోని గ్రంథాలయ ఆవరణలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మల్లేశ్ శంకశాల, ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జాఫర్, ఎస్సీ, ఎస్టీ సెల్ సంచాలకురాలు డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో ఘనంగా జయంతి నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- శ్రీవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పుట్టమన్ను తీసుకువస్తున్న ఈవో, ధర్మకర్తలు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా పాతబజార్ గౌరీశంకరాలయం నుంచి పుట్టమన్ను తీసుకొచ్చారు. అనంతరం అధ్యయనోత్సవ మండపంలో శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామికి సహస్ర కళశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ధ్వజాధివాసం జరిగాయి. రాత్రి స్వామివారు ఆలయ మాడ వీధుల్లో శేషవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకుముందు బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా చిగురుమామిడి మండలంలోని రేకొండ, చిగురుమామిడి, సుందరగిరికి చెందిన కళాకారులు ఆలపించిన భజన గీతాలు అలరించాయి. కళాకారులకు నిర్వాహకులు, సాంస్కృతిక శాఖ ఇన్‌చార్జి సల్వాజీ ప్రవీణ్ స్వామివారి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు, నాగరాజాచార్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు శ్రీనివాస్, గంగాధర్, ఈవో వెంకన్న పాల్గొన్నారు.

నేటి నుంచి కొత్తగట్టులో బ్రహ్మోత్సవాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 15: ఈ నెల 16 నుంచి మార్చి 2 వరకు కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 20న స్వామి వారి కల్యాణం, 24న పౌర్ణమి జాతర, 25న నాకబలి (పుష్పయాగం) కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

హుజూరాబాద్‌టౌన్/ వీణవంక/ చొప్పదండి, ఫిబ్రవరి 15: ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. హుజూరాబాద్ ఏసీపీగా శ్రీనివాస్‌జీ కేసీక్యాంప్‌లోని కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించగా, సబ్ డివిజన్‌లోని సీఐలు, పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి, అభినందనలు తెలిపారు. అలాగే వీణవంక మండల ఎంపీడీవోగా శ్రీధర్, చొప్పదండి మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు బాధ్యతలు చేపట్టగా, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. చొప్పదండి మున్సిపల్ కమిషనర్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్న శాంతికుమార్‌కు వీడ్కోలు పలికారు.

హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపల్లి, ఫిబ్రవరి 15: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 19 వరకు రేకుర్తిలో 52వ తెలంగాణ సీనియర్ మెన్, ఉమెన్స్ చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు రేకుర్తిలో జరుగనున్న పోటీల్లో పలు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, విద్యా సంస్థల ప్రతినిధులు సతీశ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, హరి కృష్ణ, ఫాదర్ జోసఫ్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ వెంకటేశ్, పీఈటీలు శ్రీనివాస్, దుర్గ రాజు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

హుజూరాబాద్‌టౌన్,ఫిబ్రవరి 15: యాసంగిలో వరి సాగు చేసే రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని ఏవో సునీల్‌కుమార్ సూచించారు. గురువారం హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో వరి, మక్క పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ముందస్తు నాట్లు వేసిన వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణకు ఒకసారి కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. యసంగిలో నాటువేసే ముందు నారు ఆకు కోనలు కత్తిరించి నాటాలని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మన్‌నిధి పథకంలో నమోదైన రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సతీశ్‌రెడ్డి, ఎంపీటీసీ రావుల అనిత, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన నాయకులు

గంగాధర, ఫిబ్రవరి 15 : గంగాధర మండల నూతన ఎంపీడీవో రామును గురువారం బీఆర్ఎస్ నాయకులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్ ఎగ్జిబిషన్‌కు పారమిత విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు సిద్రా రహ్మత్, శుభశ్రీ సాహు 2023-24 విద్యా సంవత్సరానికి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా ప్రకటనలో పేర్కొన్నారు. గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో సిద్రా రహ్మత్ సిద్ధం చేసిన మ్యాజిక్ కోట్, శుభశ్రీ రూపొందించిన మల్టీ ఫంక్షనల్ ఎకో ఫ్రెండ్లీ ఆగ్రో మెషిన్ స్థానం సాధించాయన్నారు. ఈ మేరకు విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాద్‌రావు, డైరెక్టర్లు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగికి మెడల్

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 15: టీఎస్ ఆర్టీసీ జోనల్ వర్క్ షాపులో మెకానిక్‌గా పని చేస్తున్న కూన కిషన్ గోవాలో ఈనెల 8 నుంచి 13 వరకు నిర్వహించిన సిక్స్ నేషనల్ మాస్టర్ గేమ్స్‌లో బ్రాన్స్ మెడల్ సాధించారు. విజేతగా నిలిచి కిషన్ జూలైలో పాన్ అమెరికా క్లాస్‌ల్యాండ్‌లో జరుగనున్న ఇంటర్నేషనల్ మాస్టర్స్‌కు ఎంపికయ్యారు. మెడల్ సాధించిన కిషన్‌ను ఆర్టీసీ ఉన్నతాధికారులు అభినందించారు.

ఇరుకుల్లలో ధర్మసత్రం ప్రారంభం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 15: ఇరుకుల్లలోని పోచమ్మ ఆలయంలో ధర్మసత్రాన్ని జూవ్వాడి రంగరావు ప్రారంభించారు. గురువారం ఇరుకుల్ల పోచమ్మ ఆలయంలో జువ్వాడి లలితమ్మ, హనుమంతరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు రంగారావు భక్తుల కోసం పోచమ్మ ఆలయంలో ధర్మసత్రం రూ. 4.08 లక్షలతో నూతనంగా నిర్మించి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ బలుసుల శారద, శంకరయ్య, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్, బుర్ర బాబు, ఎగుర్ల బీరయ్య, నేదునేరి వీరయ్య, కత్తరయ్య తదతరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్లపై దాడి సరికాదు

తెలంగాణచౌక్,ఫిబ్రవరి15: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలో క్రిస్టియన్లపై దాడి సరికాదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్ పేర్కొన్నారు. గ్రామంలో రోడ్డు నిర్మాణ విషయంలో జరిగిన గొడవలో క్రిస్టియన్లను లక్ష్యంగా చేసుకొని కర్రలతో దాడికి పాల్పడి దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. దాడిలో గాయపడిన వారి పరామర్శకు వెళ్లిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు.

ఇంటి నంబర్ల కేటాయింపులపై పోలీసుల ఆరా

కార్పొరేషన్, ఫిబ్రవరి 15: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో కేటాయిస్తున్న ఇంటి నంబర్ల వివరాలపై పోలీస్ అధికారులు దృష్టి పెట్టారు. ఇటీవల కాలంలో నగరంలో ప్రభుత్వ స్థలాల్లో ఇంటి నంబర్లు కేటాయించి, కబ్జా చేసి విక్రయాలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వచ్చాయి. పోలీస్ శాఖ ఇప్పటికే తమకు వస్తున్న ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నారు. కాగా పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో ఇంటి నంబర్లు కేటాయించి ఆక్రమిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో వీటిపై కూడా పోలీస్ శాఖ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో గురువారం పలువురు పోలీస్ అధికారులు నగరపాలక సంస్థలో ఇంటి నంబర్లు కేటాయించే విధానం, ఆయా కేటాయింపులకు అవసరమయ్యే డాక్యుమెంట్ల పరిశీలనపై రెవెన్యూ విభాగంలోని సిబ్బంది నుంచి వివరాలు సేకరించినట్లు సమాచారం. దీంతో ఒక్కసారి బల్దియాలో కలకలం మొదలైంది. ఇప్పటికే పలు భూదందాల విషయంలో నేతలు అరెస్టు అవుతుండగా, ఇప్పుడు ఇంటి నంబర్ల కేటాయింపుపై వివరాలు సేకరించడంతో నగరపాలక అధికారుల్లోనూ టెన్షన్ మొదలైంది. నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా జరిగితే తమకు ఇబ్బందులు తప్పవన్న భయాందోళన ఉద్యోగుల్లో మొదలైంది.

ముగిసిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

మానకొండూర్ రూరల్/ చిగురుమామిడి/ కరీంనగర్ రూరల్/ చొప్పదండి, ఫిబ్రవరి 15: జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గురువారం ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారం పాటు గ్రామాల్లో చేసిన పనులు, రూపొందించిన ప్రణాళికలను గ్రామస్తులకు వివరించారు. మానకొండూర్ మండలం లలితాపూర్‌లో ప్రత్యేకాధికారి వెంకటేశం, కార్యదర్శి పవన్ కుమార్, చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో ప్రత్యేకాధికారి శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రామ్‌కి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందిని సత్కరించారు. కరీంనగర్ మండలం నగునూర్‌లో జరిగిన గ్రామ సభకు ఎంపీడీవో సంజీవరావు హాజరు కాగా, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి, తహసీల్దార్ నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎంపీపీ చిలుక రవీందర్ హాజరై మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల సేవలను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎండీ మెహతబ్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లలితాపూర్‌లో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ప్రత్యేకాధికారి వెంకటేశం, కార్యదర్శి పవన్ కుమార్

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి15: హుజూరాబాద్ పట్టణంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థల్లో గురువారం 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించి, ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో ఈ టెస్ట్ నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొడిశెట్టి అభిలాష్, నాయకులు గజ్జల సందీప్, సాయి నిఖిల్ పాల్గొన్నారు.

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 15: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని వాణికేతన్ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలను గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు ప్రశ్న పత్రలను అందజేశారు.

మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేశాం

రాంనగర్, ఫిబ్రవరి 15: కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేంద